
# హ్యాపీ బర్త్ డే



## ఇందుమతీ పట్నాయక్

కారు సర్వీసింగ్‌కి వెళ్ళింది ఆ రోజు. అందుచేత క్లబ్‌నుండి నడిచివచ్చాను యింటికి. ఆ వేళ క్లబ్‌లో ఫిల్మ్ షో వుంది. కాబట్టి నేను తప్ప అందరూ అక్కడే వుండిపోయారు. లేనట్టయితే, యిలా కారులేని సమయాల్లో మెంబర్లలో ఎవరో ఒకరు నన్ను యింటిదగ్గర డ్రాప్‌చేసి వెళ్తారు.

ఆ రోజు వుదయం పది నుండి సాయంత్రం అయిదు గంటల వరకు నాకు కాలేజీలో వూపిరి సలపని పని. రాబోయే ప్రాక్టికల్ ఎగ్జామ్స్ కోసం, స్పెసిమెన్స్, స్లైడ్స్, అన్నీ వెతికి బయటికి తీయించి, లిస్టు తయారుచేసి, మళ్ళీ వాటినన్నింటినీ జాగ్రత్తగా విడి విడిగా సర్దించి, ప్రాక్టికల్ రికార్డ్స్ అన్నీ దిద్ది బయటపడేటప్పటికి తల ప్రాణం తోకకి వచ్చింది. రోజంతా నుంచునో, అటూ యిటూ తిరుగుతూనో వున్నానేమో కాళ్ళు విరిగిపోతున్నంతగా నెప్పిపెట్టసాగాయి. క్లబ్‌కి వెళ్ళాలన్పించటం లేదు మొదట్లో. కానీ ఆ రోజు మా క్లబ్ ప్రెసిడెంట్ వేరే వూరు ట్రాన్స్‌ఫర్‌మీద వెళ్తున్న కారణంగా, ఆమెకి వీడ్కోలు ఏర్పాటు చేశారు. ఆవిడ నాకు అంతో, యింతో మిత్రురాలు. అంచేత లేని ఓపిక తెచ్చుకుని వెళ్ళాను.

వేసవికాలం అవటం చేత గంట ఏడవుతున్నా యింకా ఎండగా, వుక్క పోస్తూవుంది. త్వరగా నడుస్తూండటం వలన మరింత వుక్క, చెమట, అలసట అన్పించసాగింది. పార్కు దాటితే యిల్లు. త్వర త్వరగా నడవసాగాను. అంతదూరాన వున్నా, యింట్లోంచి స్టీరియోలో రికార్డు సంగీతం వినవస్తోంది. ఇవాళ బాబు పుట్టినరోజు! ఇప్పుడు పదేళ్ళ వాడికి. సరిగ్గా పది సంవత్సరాల క్రితం యిదే సమయానికి ...... కుండపోతగా వర్షం......... లైట్లారిపోయాయి ఆ గాలికి. నర్సింగ్ హోంలో......టేబిల్‌మీద నొప్పుల్తో మెలితిరిగిపోతున్న నేను...ఆల్బ్యూమిన్ ..ఎక్యూట్ ఎనీమియా... యివి తెండూ చాలవన్నట్టు బ్రీచ్ ప్రెజెంటేషన్! ఆ బాధని తట్టుకోలేక దగ్గరే నుంచుని నాకు ధైర్యం చెప్తున్న డాక్టర్ ఆంటీ చేతిని, నా శక్తికొద్దీ, రెండు చేతుల్తోటీ మెలితిప్పాను. అయినా ఆవిడ తన చేతిని నా నుండి వెనక్కి లాక్కోలేదు. నాకోసం......

నా బాధని తగ్గించటానికి, ఆ బాధని ఓర్చుకుంది మౌనంగా. బొందితో నరకానికి వెళ్ళివచ్చిన రోజది !

గేటు దగ్గరికి వచ్చేశాను. హఠాత్తుగా సంగీతం ఆగిపోయింది. ఆ తర్వాత కొద్దిసేపటికి మాటలూ......నవ్వులూ ...కేరింతలూ. మరో నిమిషానికి ఓ చిన్నారి గొంతు 'హేపీ బర్త్‌డే...... అంటూ మొదలుపెడ్తే, తతిమ్మా ఆడా, మగ పిల్లల గొంతుకలు తమ యిష్టం వచ్చిన స్థాయిలో 'హేపీ బర్త్‌డే' అంటూ అందుకున్నాయి.

ఈ రోజు హడావిడంతా ఆయాదే! హాలంతా రంగుకాగితాల్తో, బెలూన్లతో అలంకరించింది. ఎంతమంది పిల్లలు పార్టీకి వొస్తున్నారో కనుక్కుని వాళ్లకి మెరిసే కాగితంఅంటించిన అట్ట ఫాన్సీ టోపీలు తయారుచేసింది. మైసూర్ పాక్, పెరుగు వడలు, టొమాటో బాత్ చేసింది వాళ్ల తింటానికి. అంతకు క్రితంరోజు ఓ పెద్ద కేక్ బేక్ చేసి, అది బాగా చల్లారేక, బాబుకి యిష్టమని చాకొలేట్ ఐసింగ్ చేసింది. కేక్‌కి. ఆ తర్వాత బాబుచేత యింగ్లీషులో ఓ కాగితంమీద రాయించుకుని, దాన్ని చూసి, ఆ కాఫీరంగు ఐసింగ్‌మీద, తెల్లటి ఐసింగ్‌తో "మెనీ హేపీ రిటర్న్స్ ఆఫ్ ద డేటు నిరంజన్" అని రాసింది. ఇంతహడావిడిపడుతున్నా నన్ను ఒక్క పనీ ముట్టుకోనివ్వలేదు.

మెట్లెక్కి వరండాలోనికి వచ్చాను. పాట తారాస్థాయిలో వుంది. 'హేపీ లాంగ్ లైఫ్ టూ యూ......హేపీ లాంగ్ లైఫ్ టూ యూ డియర్ నిరంజన్.........'హాల్లోని కడుగు పెట్టాను.

జడ్జిగారి మనవడు అనిల్, మెడికల్ కాలేజి డీన్‌గారి ఆఖరబ్బాయి పవన్, ఎం.ఎల్.ఎ. గారమ్మాయి శశిబాల. యింకా నలుగురైదుగురు ఆఫీసర్ల పిల్లలు




అందమైన దుస్తుల్లో, ఆయా తయారు చేసిన ఫాన్సీటోపీలు ధరించి, బర్త్‌డే కేక్ వుంచిన టీపాయ్ చుట్టూ నుంచుని పాడుతున్నారు. ఆ టోపీలు అట్టవైనా ఏవో బంగారు కిరీటాలు ధరించిన చక్రవర్తుల్లా వాళ్లందరి మొహాలు సంతోషంతో వెలిగిపోతున్నాయి. ఆనందం, ఉత్సాహం వెల్లివిరుస్తోన్నా యక్కడ. ఆ ఖరీదైన బట్టల్లో, ఆ చమ్కీ టోపీల్లో నిజంగానే వాళ్లందరూ బుల్లి చక్రవర్తుల్లా కన్పిస్తున్నారు. నన్ను చూసిందే ఒక్కసారిగా "హలో, ఆంటీ" అన్నారు నవ్వుతూ.

నేను కూడా నవ్వుతూ పలకరింపుగా హలో అని నాలుగడుగులు వేశాను వారివైపు అంతలో నా కళ్లు హఠాత్తుగా ఓ చోట నిల్చిపోయాయి పిల్లలందరూ నుంచున్న అందమైన తివాసీ మీద బురద అడుగులు ! అది సరికొత్త ఒ.సి.ఎం. కార్పెట్. దాని ఖరీదు రెండువేలకి తక్కువలేదు. డ్రాయింగ్ రూం గోడలకున్న ఎమల్షన్ పెయింట్‌కి మాచ్ అయ్యే విధంగా, అదే రంగులున్న ఈ కార్పెట్‌ని అతి కష్టంమీద వెతికి, వెతికి కొన్నాను. కెంపు, పసుపు, ముదురు నీలం రంగుల పూలతో, అందమైన డిజైన్లతో నేయబడ్డ ఈ కార్పెట్ మీద కాలుమోపితే, పూలరాసి మీద మోపినంత మెత్తగా వుంటుంది. అసలు నేనెప్పుడూ దీన్ని తొక్కను. ఎక్కడ నలిగిపోతుందో, మాసిపోతుందోనని భయం. బాబుకి కూడా గట్టిగా చెప్పాను దీన్ని కొన్నరోజునే తొక్కి పాడుచెయ్యకూడదని. అందుకే మేం దీన్ని తొక్కకుండా, కార్పెట్ లేని ఖాళీస్థలంలోంచె నడిచి వెళ్తుంటాం. నౌఖర్లు డ్రాయింగ్ రూంలోకి రావటానికి వీల్లేదు. వాళ్ల చుట్టూ తిరిగి రావల్సిందే ! అంతటి ప్రాణప్రదమైన కార్పెట్ మీద ఈ బురద అడుగులు చూడటంతోటే నాకు పిచ్చి కోపం, ఆవేశం వచ్చేసాయి.

ఎవరివీ అసహ్యమైన అడుగులను కొంటూ పిల్లలవైపు, వాళ్ల కాళ్లవైపు మార్చి, మార్చి చూసాను. హఠాత్తుగా నేనిలా కోపంగా అయిపోవటంచూసిన పిల్లలు భయం, భయంగా నుంచున్నారు. అందరికన్నా వెనగ్గా, సోఫా ప్రక్కగా ఒదిగి నుంచుని, లాగులేకుండా, వొట్టి కాళ్లతో, చొక్కా మాత్రం వేసుకుని, కళ్లు వెడల్పు చేసుకుని నన్నే చూస్తున్నాడు, ఆయా మూడేళ్ల కొడుకు.



దగ్గరగా వెళ్ళి చూసాను. మోకాలి వరకూ బురద అంటి వుంది వాడి కాళ్ళకి ! అంతే; వాడి నివతలకి బలంగా లాగి, చాచి కొట్టాను వాడి చెంప మీద— ఆ తర్వాత గబగబా మెట్లెక్కి, పైన నా గదిలోనికెళ్ళి తలుపేసుకున్నాను.


ఓ అయిదు నిమిషాలదాకా క్రింది నుండి ఎటువంటి శబ్దమూ వినిపించ లేదు. ఆ తర్వాత ఎవరిదో గొంతుక "కమాన్ నిరంజన్..." అనటమూ, ఆ తర్వాత కొద్ది క్షణాలకి బర్త్‌డే కేక్ కోస్తూన్న సూచనగా నవ్వులూ, చప్పట్లూ విన్పించసాగాయి. అలాగే ఆ సందడినంతా వింటూ, ఫాలో అవుతు న్నాను వాళ్ల చేస్తున్న పనుల్ని. హఠాత్తుగా యిలా వుద్రేకపడిపోవటం వల్లనేమో తలనొప్పి మొదలైంది. ఎక్కడలేని అలసటగా కూడా అన్పించింది. అతి కష్టంమీద లేచి, ఫాన్ వేసుకుని పడుకున్నాను. ఆ చల్లటి గాలికి నిద్ర కమ్ముకురాసాగింది.

హఠాత్తుగా మెలకువ వచ్చింది. చేతికున్న వాచ్ కేసి చూశాను. గంట ఎనిమిది కావొస్తూంది. లేచి పక్కమీద కూర్చున్నాను. మంచం ప్రక్కగా వున్న టీపాయ్‌మీద నా దృష్టి పడింది. దానిమీద ఒక సాసర్లో కేక్ ముక్కా, మరో ప్లేట్‌లో ఆ రోజుకని చేసిన ఫలహారాలూ, గ్లాసులో మంచి నీళ్లూ వున్నాయ్ ! ఇవి చూడగానే అంతకు క్రితం జరిగిన సంఘటనలన్నీ ఒక్కొక్కటే గుర్తుకి రాసాగాయి.

ఇవాళ జరిగిన సంఘటన కెవరు బాధ్యులు ? వాడి వొళ్లంతా అలా మట్టి కొట్టుకున్నదంటే అది వాడి తప్పా? లేక

ఆయాదా ? ఉన్న ఒక్క కొడుకుని శుభ్రంగా ఎందుకుంచలేకపోయింది ? అవును, ఎందుకు ? ఎందుకుంచలేకపోయింది. ఆయా ? ఎందుకు ?

వాడంటే ప్రేమ లేకనా ? లేక అశ్రద్ధా ? ఇవేం కావేమో ? ఆమె అందరి తల్లులకన్నా ఎక్కువగానే ప్రేమిస్తోందేమో తన కొడుకుని. అందరి పిల్లల్లాగే తన కొడుకు కూడా ఖరీదైన బట్టలు తొడుక్కుని, శుభ్రంగా దర్జాగా కనిపించాలనికూడా కోరుకొంటూ వుండొచ్చు. కానీ, యివాళ నా కొడుకు ముద్దూ, ముచ్చట తీర్చటం కోసం ఆ హడావిడిలో వాడి విషయం పూర్తిగా మర్చిపోయింది ఆయా ! మరి; నేను చేసిందేమిటి యిందాక ??




అప్రయత్నంగా నా కుడిచేతికేసి చూసాను. ఎక్కడిదో ఎరుపు — కోడి పిల్లను హఠాత్తుగా తన్నుకుపోయిన గద్దకాళ్లకి అంటిన రక్తం తాలూకు ఎరుపు నా అరచేతికి అంటినట్టుగా అన్పించింది ! నాకు తెలీకుండానే గుండెలు బరువెక్కసాగాయి. అలాగే నా అరచేతిని పదే పదే గ్రుచ్చి చూస్తున్నాను. క్రమంగా నా కళ్లు నీళ్లతో నిండుకున్నాయి. మునివ్రేళ్లతో కన్నీటిని తుడుచుకున్నాను. బుగ్గమీది నీటిచుక్క, వేలి కొస నుండి అరచేతి మీదకి, ఎరుపురంగుని కడిగేస్తూ, ఆ బరువుతో నెమ్మదిగా జారుతోంది...

నా ఆలోచనల్ని భగ్నంచేస్తున్నట్టుగా దూరాన్నుండి అస్పష్టంగా ఏదో పాట. శ్రద్ధగా విన్నాను చెవులు రిక్కించుకుని. ఏదో పాట కాదది. అదే పాట... అదే...యిందాక నేను విన్నదీ నన్నింత శోకకి గురిచేసిందీ, 'హాపీ బర్త్ డే, టూ యూ ......' సన్నటి పరిమళంలాగా తెరలు, తెరలుగా గాల్లో తేల్తూ వచ్చి నా చెవులకి సోకుతూంది. అప్రయత్నంగా లేచి నుంచున్నాను. "ఇదేమిటి? పిల్లలందరూ ఈ పాటికి యిళ్లకి వెళ్ళిపోయివుండాలే ? ఇంత రాత్రి వేళ పుట్టినరోజు చేసుకుంటున్న దెవరు? ఎక్కడి దీ పాట" అనుకొంటూ బాల్కనీలోకి నడిచి పాట వినవస్తున్న దిక్కుగా చూసాను.

లాన్‌కి అవతలవైపు, పంప్ షెడ్ పక్కగా వుంది ఆయావాళ్లిల్లు. అక్కడి నుండే విన్పిస్తోంది పాట. వసారాలో మసక వెలుతుర్లో ఆకారాలు అస్పష్టంగా కన్పిస్తున్నాయి. ఒక్కసారిగా వెలుతుర్లోంచి, చీకట్లోకిరావటంవల్ల, కళ్లు సరిగా ఆనలేదు. నాలుగడుగులు ముందుకువేసి, కళ్లు చించుకొని చూసాను......ఆయా తన కొడుకుని దగ్గరకి తీసుకొని, ఏదో నచ్చజెప్తున్నట్టు, చేత్తో ఏవో సంజ్ఞలు చేస్తూంది. వాడు పేచీ పెడుతున్నట్టుగా తల అటూ, ఇటూ, విదిలిస్తున్నాడు. బాబు పాట పాడుతూ, తలా చేతులూ వూగిస్తూ వాడిని మరిపించాలని విశ్వప్రయత్నం చేస్తున్నాడు

చప్పుడు కాకుండా, వెనుకవైపున్న మెట్లగుండా దిగి వెళ్లి క్రీనీడలో నుంచున్నాను. నేనున్న చోటుకి జరిగేదంతా స్పష్టంగా కనిపిస్తూవుంది. అక్కడ వసారాలో చిన్న స్టూలు వుంది. దాని మీద ఓ పళ్లెంలో కేక్ సగానికి




కోసింది వుంది. దానిపైన మూడు కొవ్వొత్తులు వెలుగుతున్నాయి.

"వూరుకోరా చిన్నూ; నా ఫ్రెండ్స్ అందరికీ చిన్న, చిన్న ముక్కలు కోసిచ్చి, నీ కోసమని అర్ధం కేకు వుంచాన్రా! ఇదుగో కత్తి. ఇంకోసారి పాట పాడతాను నేను. అప్పుడు నువ్వు కొయ్యాలి కేకుని, తెలిసిందా?" అంటూ కత్తిని వాడి కుడిచేతిలో వుంచి గుప్పిట మూశాడు బాబు.

"నాకేం అఖ్ఖర్లేదు ఫో" అంటూ కత్తిని కింద పారేసి మరింత గట్టిగా ఏడవసాగాడు వాడు.

ఆ ఏడుపు కేమాత్రం విసుక్కోలేదు బాబు, పెద్ద ఆరిందాలా, మోకాళ్ల మీద వంగి కూర్చుని, వాడి కన్నీళ్లని తుడుస్తూ "ఏం కావాలో చెప్పు. ఏడవొద్దు" అంటూ బతిమాలుతున్నాడు.

"నువ్వు అన్ని కొవ్వొత్తులు వెలిగించుకుని నాకు మరి మూడే పెట్టావేం?" వెక్కిళ్ల మధ్య అన్నాడు చిన్నూ.

ఒక్కసారిగా ఆయా, బాబు, వాడి మాటలు విన్నదే ఫక్కుమని నవ్వారు. అతికష్టంమీద నేనూ వచ్చే నవ్వాపుకున్నాను.

'ఒరేయ్; ఎవరికెన్ని సంవత్సరాల వయసుంటే, కేక్ మీద అన్ని కొవ్వొత్తులు పెట్టుకుంటార్రా. మరి నీకు మూడేళ్లేగా వయసు ? అందుకే నీకు మూడే కొవ్వొత్తులు" అన్నాడు బాబు.

ఈ తర్కం వాడి కేమాత్రం నచ్చినట్టు లేదు. తల అడ్డంగా వూపాడు ఏడుపు ఆపి.

నవ్వుతూ, "సరే, క్రిందపడ్డ కత్తి తీసుకో. ఈలోపల నేను కొవ్వొత్తులన్నీ అమరుస్తాను," అని మిగతా ఏడింటిని కూడా వెలిగించి కేకుచుట్టూ అతికించాడు పళ్లేనికి. పది కొవ్వొత్తులూ నిశ్చలంగా వెలుగుతున్నాయి. ఆ సుతిమెత్తటి కాంతిలో చిన్నుగాడి మొహం కూడా తృప్తితో, సంతోషంతో వెలిగిపోతూంది. వాడి కళ్లలో తడి యింకా ఆరిపోకుండా మిలమిలా మెరుస్తూ వుంది. నేను అప్రయత్నంగా ఆయా మొహంవైపు చూశాను. ఆమె బాబు మొహాన్ని రెప్పవాల్చకుండా విస్మయంతో చూస్తూవుంది. ఆమె కళ్లలో వాడి పట్ల ఆరాధనా భావం తొణికిసలాడుతూ వుంది.

బాబు పాట ముగిసింది. చిన్నూ కేకుని కోసి కొవ్వొత్తులన్నింటినీ వూద సాగాడు. రివాజు ప్రకారం ఆయా, బాబు, చప్పట్లు కొడుతూంటే, నేను యివతలకి వచ్చి వాళ్ళతో శృతి కలిపాను.

"అమ్మగారూ!" అంది విస్మయంతో ఆయా. ఏనాడూ ఆ యింట్లో అడుగు పెట్టని నన్ను చూసి, 'ష్' అని వారించి చిన్నుగాడి తలమీద నా కుడి చేతిని వుంచి "హాపీ బర్త్‌డే టు యూ చిన్నూ" అన్నాను.

వాడు తలెత్తి నా వైపు చూశాడు. ప్రపంచానికంతటికీ తానే సామ్రాట్టు అయినట్టుగా. విజయగర్వంతో, సంతోషంతో, వెలిగిపోతూంది వాడి మొహం ! కేకు ముక్కని వాడి నోట్లో పెడ్తూ, "ఆయా; యింకో అరగంటలో అయ్యగారు యింటికి వస్తారు. ఈలోగా చిన్నూని సిద్ధంచేసి పంపించు. వాడీ పూట మాతోటే భోజనం చేస్తాడు" అన్నా.

నమ్మలేనట్టు, యింకా, ఆశ్చర్యంతో కళ్లు పెద్దవిచేసుకుని చూస్తూంది ఆయా నన్ను.

నేను నవ్వుతూ, "ఏరా, చిన్నూ, తప్పకుండా వస్తావు కదూ భోజనానికి ? త్వరగా రావాలి !" అన్నా.

"ఓ అన్నాడు వాడు తలూపుతూ ధీమాగా !

తేలికపడ్డ హృదయంతో యింటి వైపు నడిచాను.